



సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రితో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

# పోలింగ్ సామగ్రి పంపిణీ

- పూర్తిస్థాయిలో సామగ్రిని అందించండి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన, తనిఖీ




డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 29 : శాసనసభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పూర్తి స్థాయిలో అందించాలని సంబంధిత అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. బుధవారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ శరత్ సందర్శించారు. ఈ క్రమంలో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి, ఎన్నికల సామగ్రి పంపిణీ తీరు తెన్నులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కల్పించిన తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర వసతులు ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు పీవో, ఏపీవో, వోపీవోలతో కూడిన బృందాలు హాజరయ్యారా? లేదా? అని కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలన్నారు. చెక్ లిస్ట్‌తో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా? లేదా? అని సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితోపాటు పోలీసు సిబ్బందిని సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్వోలకు సూచించారు. కలెక్టర్ వెంట ఎస్పీ రూపేశ్, సాధారణ పరిశీలకుడు పవన్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ దయాల్ గంగ్వార్, ఆర్వో రవీందర్‌రెడ్డి ఉన్నారు. నారాయణఖేడ్ లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కలెక్టర్ వెంట సాధారణ పరిశీలకుడు దీపక్ సింగ్లా, ఆర్వో వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



జహీరాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారులు



జహీరాబాద్‌లో పోలీసుల సిబ్బందికి సూచనలు..



సంగారెడ్డిలోని అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో బ్యాలెట్ యూనిట్‌ను చెక్ చేస్తున్న పోలింగ్ అధికారులు





సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో బ్యాలెట్ యూనిట్‌ను చెక్ చేసి సిబ్బందికి అందజేస్తున్న పోలింగ్ అధికారులు



జహీరాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

# న్యాల్‌కల్ మండలంలో అకాల వర్షం

- దెబ్బతిన్న పంటలు, రైతులకు తీవ్ర నష్టం

న్యాల్‌కల్, నవంబర్ 29 : ఆరుగాలం కష్టపడి పంటలను పండిస్తున్న రైతులను అకాల వర్షాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మంగళవార రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అమీరాబాద్, చీకుర్తి, కాకిజనవాడ, హుస్సేన్‌నగర్, హద్నూర్, రాంతీర్థం, వడ్డి, అత్నూర్, డప్పూర్, న్యాల్‌కల్, ముంగి, తాట్‌పల్లి, గంగ్వార్, రుక్మాపూర్, ముంగి, హుసేల్లి తదితర గ్రామాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంటలు, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగింది. కంది, జొన్న, మిరప, కూరగాయల పంటలు నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు కూలడంతోపాటు వైర్లు తెగిపోవడం, పరికరాలు పాడైపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంధకారం నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



న్యాల్‌కల్ : అమీరాబాద్ గ్రామ శివారులో నేలకొరిగిన జొన్నపంట



అకాల వర్షానికి పాడైన పత్తి పంట



ఝరాసంగం : ఎల్గోయి గ్రామంలో నేలకొరిగిన చెరుకు తోట

## ఓటు హక్కు వినియోగించుకోవాలి



న్యాల్‌కల్‌లో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వస్తున్న సిబ్బంది

న్యాల్‌కల్, నవంబర్ 29 : నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి రాజిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. న్యాల్‌కల్ మండలంలోని 37 గ్రామపంచాయతీపరిధిలో 47వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 62 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, దీనికోసం 248 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. మైక్రో అబర్వర్స్, వెబ్ కాస్టింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరారని తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి 5 గంటల వరకు ఓటర్లు 16 రకాల గుర్తింపుకార్డులతో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.